# ప్రభుత్వ బడుల్లో మెరుగైన సౌకర్యాలు

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య
- పలు అభివృద్ధి పనులకు శ్రీకారం
- సోనాపూర్‌లో 'మన ఊరు-మన బడి' నిర్మాణాలు ప్రారంభం



పాఠశాలలో సౌకర్యాలను పరిశీలిస్తూ విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

కాసిపేట, జూన్ 19 : కార్పొరేట్‌కు దీటుగా తెలంగాణ ప్రభుత్వం సర్కారు బడుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించిందని, నాణ్యమైన విద్య అందుతుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పేర్కొన్నారు. మండలంలోని సోనాపూర్‌లో ప్రైమరీ పాఠశాలలో 'మన ఊరు-మన బడి' కింద రూ.23,34,563 నిధులతో పాఠశాల ఆధునీకరణ, ప్రహరీ, వంట గది, మరుగు దొడ్ల నిర్మాణాలు చేపట్టగా, సోమవారం వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పేద, మధ్య తరగతి విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నదన్నారు. ఉన్నత విద్య అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.

### జీపీ భవన నిర్మాణ పనులు ప్రారంభం

మండలంలోని గట్రావ్‌పల్లి, మద్దిమాడ గ్రామ పంచాయతీలకు రూ.20 లక్షల చొప్పున ఐటీడీఏ నిధులు మంజూరయ్యాయి. దీంతో గ్రామ పంచాయతీల భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. చిన్న గ్రామ పంచాయతీలతో అభివృద్ధి సాధ్యమని సీఎం కేసీఆర్ జీపీలను ఏర్పాటు చేసి అభివృద్ధి చేశారన్నారు.

### దేవాపూర్‌లో అభివృద్ధి పనులు..

మండలంలోని దేవాపూర్ గ్రామ పంచాయతీలో రూ.15 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణాలను ఎమ్మెల్యే చిన్నయ్య ప్రారంభించారు. రూ.7 లక్షలతో నిర్మించిన మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించారు. రూ.5 లక్షలతో నిర్మించిన అంగన్వాడీ కేంద్ర భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. మండల పరిషత్ నిధులు రూ.4 లక్షలతో సీసీ రోడ్డు, రూ.3 లక్షలతో సైడ్ డ్రైన్ నిర్మాణాలను ప్రారంభించారు.

### మొక్కలు నాటిన ఎమ్మెల్యే

మండంలోని దేవాపూర్, సోనాపూర్, గట్రావ్‌పల్లి, మద్దిమాడ గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన హరితహారం కార్యక్రమంలో ఎమ్మెల్యే చిన్నయ్య పాల్గొని మొక్కలు నాటారు. ముందుగా హరితోత్సవంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ, ఎంపీపీ రొడ్డ లక్ష్మి, జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, వైస్ ఎంపీపీ పూస్కూరి విక్రంరావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి, ఎంపీడీవో ఎంఏ అలీం, ఎంఈవో వాసాల ప్రభాకర్, సర్పంచ్‌లు మడావి తిరుమల, ఆడె జంగు, పెంద్రం రాజు, సుశీల, ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంజులారెడ్డి, ఎంపీవో నాగరాజు, నాయకులు అట్టెపల్లి శ్రీనివాస్, మడావి అనంతరావు, కార్యదర్శి కవిత తదితరులు పాల్గొన్నారు.

# మెనూ ప్రకారం ఆహారం అందించాలి

- కుమ్రంభీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్



కూరలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

ఆసిఫాబాద్, జూన్ 19 : గురుకులాల్లో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని కుమ్రంభీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ సూచించారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సోమవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ, విద్యార్థుల హాజరు పట్టిక, పాఠశాల రికార్డులను పరిశీలించారు. వండిన ఆహార పదార్థాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాఠశాలలు ప్రారంభమైనందున విద్యార్థుల హాజరు పూర్తిస్థాయిలో ఉండేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. విద్యా సంవత్సరానికి అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. పాఠశాలలోని తరగతి గదులు, వంటశాల, మూత్రశాలలు, ఆవరణ, పరిసరాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. ఆమె వెంట పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి మొక్కనూ బతికించాలి

- రానున్న హరితహారాన్ని విజయవంతం చేయాలి
- ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్
- భీమారం రేంజ్ పరిధిలో హరిత నిధి మోడల్ నర్సరీ, సీడ్ స్టోరేజ్ యూనిట్ ప్రారంభం
- పాల్గొన్న మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్, డీఎఫ్‌వో శివ్ ఆశిష్ సింగ్



భీమారం : హరిత నిధి మోడల్ నర్సరీని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ బాల్క సుమన్, కలెక్టర్ సంతోష్

భీమారం, జూన్ 19 : హరితహారంలో భాగంగా నాటిన ప్రతి మొక్కనూ బతికించాలని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ సూచించారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా భీమారం రేంజ్ పరిధిలో హరిత నిధి మోడల్ నర్సరీతో పాటు సీడ్ స్టోరేజ్ యూనిట్‌ను మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్, డీఎఫ్‌వో శివ్ ఆశిష్ సింగ్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు నర్సరీలో ఉన్న మొక్కలను పరిశీలించారు. హరితహారంలో భాగంగా నాటిన మొక్కలన్నీ బతికేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. నర్సరీలో ఎన్ని మొక్కలు పెంచుతున్నారు? ఎన్ని గ్రామాలు, పట్టణాలకు పంపిణీ చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. రానున్న హరితహారంలో అందరం కలిసి విరివిగా మొక్కలు నాటాలని పేర్కొన్నారు. నర్సరీలో ఏఏ మొక్కలు పెంచుతున్నారు? వాటి ప్రత్యేకతను అడిగి తెలుసుకున్నారు. మొక్కలు ఏపుగా పెరిగే వరకూ సంరక్షణ బాధ్యత తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం ఒక లక్ష్యంతో హరితహారం కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. రాష్ట్రంలో అడవుల శాతం పెంచడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీవో వినయ్ కుమార్ సాహు, డీఆర్డీవో శేషాద్రి, భీమారం బీట్ ఆఫీసర్ శివ తదితరులు పాల్గొన్నారు.

### అర్బన్ పార్కులో హరితోత్సవం

చెన్నూర్ రూరల్, జూన్ 19: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కిష్టంపేట సమీపంలోని అంబేద్కర్ అర్బన్ పార్కులో జిల్లా ఫారెస్ట్ అధికారుల ఆధ్వర్యంలో హరితోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ కుమార్, కలెక్టర్ సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్‌తో కలిసి ప్రభుత్వ విప్ బాల్క సుమన్ హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. గత పాలకుల నిర్లక్ష్యంతో ఒక్క చెట్టు కూడా నాటలేదని, అప్పటి ప్రజాప్రతినిధులు అటవీ ప్రాంతంలో ఉన్న చెట్లను నరికించి, ఫారెస్ట్ అధికారులను వేధింపులకు గురి చేశారని, అటవీ సంపదను దోచుకున్నారని తెలిపారు. ఫారెస్ట్ అధికారులను గుర్తించిన ప్రభుత్వం బీఆర్ఎస్ మాత్రమేనన్నారు. ఇటీవలే మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో సీఎం కేసీఆర్ బహిరంగ సభలకు ఎంతో గుర్తింపు లభించిందని, దీంతో ఇతర రాష్ట్రాల ప్రజలు సీఎం కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారన్నారు. ఎన్నికల సమయంలో ప్రతిపక్షాలు సీఎం పాలనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, వాటిని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేకపోవడంతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారన్నారు. అనంతరం హరితోత్సవం విజయాల పోస్టర్లు, వైల్డ్ లైఫ్ ఆఫ్ చెన్నూర్ ఫారెస్ట్ బుక్‌లను ఆవిష్కరించారు. కిష్టంపేట జీపీ ఆధ్వర్యంలో కాటన్ సంచులను తయారు చేయించి సుమన్ చేతుల మీదుగా గ్రామస్తులకు పంపిణీ చేయించారు. హరితోత్సవంలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. శాఖ పరిధిలో విశేష సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో (ఐఎఫ్ఎఫ్) డీఎఫ్‌వో శివ్ ఆశిష్ సింగ్, ఎఫ్‌డీవోలు ఎస్ రమేశ్, వినయ్ కుమార్ సాహు, వేణు బాబు, ఎఫ్ఆర్వోలు శివ కుమార్, రవి, ఎక్బాల్ హుస్సేన్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్, డీఆర్డీవో శేషాద్రి, చెన్నూర్ ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్ పాండే, చెన్నూర్ ఎంపీపీ మంత్రి బాపు, జడ్పీటీసీ మోతె తిరుపతి, వైస్ ఎంపీపీ వెన్నపురెడ్డి బాపురెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చల్ల రాంరెడ్డి, సర్పంచ్ బుర్ర రాకేశ్ గౌడ్, ఎంపీటీసీ నగావత్ శ్రీనివాస్, ఫారెస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- కుమ్రంభీం ఆసిఫాబాద్ కలెక్టర్ హేమంత్ బోర్కడే
- కలెక్టరేట్‌లో ప్రజావాణి



అర్జీదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 19 : అధికారులంతా సమన్వయంతో పని చేయాలని, ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తుకు పరిష్కారం చూపాలని కుమ్రంభీం ఆసిఫాబాద్ కలెక్టర్ హేమంత్ బోర్కడే పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన అర్జీదారులు భూమి, పింఛన్, ఉపాధి, ఇళ్ల స్థలాలు తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్‌కు దరఖాస్తులు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హేమంత్ బోర్కడే మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తుకు పరిష్కారం అందించేలా అధికారులు చొరవ చూపాలన్నారు. ఒక్కసారి వచ్చిన దరఖాస్తు మరోసారి రాకుండా పని చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లికి 'హరిత' అవార్డు



మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత

బెల్లంపల్లి, జూన్ 19 : బెల్లంపల్లి మున్సిపాలిటీకి హరిత అవార్డు దక్కింది. మంచిర్యాల జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లో కేవలం బెల్లంపల్లికి మాత్రమే హరిత విభాగంలో అవార్డు వరించింది. హరితహారం కార్యక్రమంలో భాగంగా బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో విస్తారంగా మొక్కలు నాటినందుకు అవార్డు దక్కింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సోమవారం రాత్రి నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అటవీ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, హోం మంత్రి మహమూద్ అలీ చేతుల మీదుగా మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత అవార్డు అందుకున్నారు. పట్టణంలో నేటికి విజయవంతంగా హరితహారాన్ని కొనసాగించడంతో అవార్డు దక్కిందని సంతోషం వ్యక్తం చేశారు.